కథ

# మినిమం మర్డర్

-తిరుమలశ్రీ

ఆ నగరంలోనే కాదు, దేశమంతటా గొప్ప సంచలనం సృష్టించింది ఆ కేసు.

ఆ రోజు హైకోర్టులో హియరింగ్ వుందని తెలిసి కోర్టు అవరణంతా జనంతో నిండిపోయింది. ఆ ప్రొసీడింగ్స్‌ని కవర్ చేసేందుకని దేశపు నలుమూలలనుంచీ పత్రికా విలేఖర్లూ, వీడియోగ్రాఫర్లు, ప్రెస్ ఫోటోగ్రాఫర్లు విచ్చేశారు. రేడియో, టీవీ ఛానెల్స్ దానికి అత్యంత ప్రచారాన్ని ఇచ్చాయి.

ఆ 'మర్డర్' గురించి పట్టించుకున్నదీ, ఫిర్యాదు చేసినదీ భారతీయుడు కాదు... ఓ విదేశీయుడు! భారతదేశంమీద అభిమానంతో, ఆసక్తితో టూరిస్టుగా వచ్చిన అతని పేరు రిచర్డ్స్.

ఆ హత్యకు సాక్షీభూతుడైన కారణంగా ఆ రోజంతా నోట ముద్ద పోలేదతనికి డిప్రెషన్‌తో! ఆ దారుణాన్ని సహించలేక ఆగ్రహంతో సమీపంలోని పోలీస్‌స్టేషన్‌కి వెళ్లి రిపోర్ట్ ఇచ్చాడు.

అతను చెప్పిందంతా విని పిచ్చివాణ్ని చూసినట్లు చూశారు పోలీసులు. పరిహాసం చేశారు. ఎదురు చీవాట్లు వేసారు తప్ప 'అమూల్య'మైన సమయాన్ని పాడుచేస్తున్నాడంటూ. కేసు బుక్ చేయడానికి నిరాకరించారు. ఎఫ్.ఐ.ఆర్. రాయాలంటే 'ఫారినర్స్' యాక్ట్ కింద అతన్ని బుక్ చేస్తామని బెదిరించారు కూడా.

మనిషి బెదరలేదు. మనసును చెదరనివ్వలేదు. అది పట్టుదలకు ప్రాణం పోసింది. ఆ దారుణకాండకు పాల్పడ్డ వ్యక్తులను పట్టుకుని శిక్షింపజేసేంతవరకు తన దేశానికి తిరిగి వెళ్లరాదని నిశ్చయించుకున్నా డతను.

పోలీస్ డిపార్ట్‌మెంట్‌లోని పెద్ద తలకాయల తలుపులు తట్టాడు. తెరుచుకున్నట్టే తెరుచుకుని, మూసుకుపోయాయవి. ఎక్కడికి వెళ్లినా హేళన, ఎగతాళీ దండలుగా గుచ్చి అతని మెళ్లో వేశారు. ఆ అనుభవం అతని డిటర్మినేషన్‌కి బలం చేకూర్చిందే తప్ప హతాశుణ్ణి చేయలేదు. నిరాశకు గురిచేయలేదు.

చివరిగా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి విపులంగా లేఖ రాశాడు. హంతకుల్ని బుక్‌చేసి శిక్షించవలసిందిగా అభ్యర్థించాడు. అటువంటి దారుణం ఎప్పుడూ, ఎక్కడా జరక్కుండా అరికట్టమని అర్థించాడు.

కేవలం చుట్టపుచూపుగా వచ్చిన ఓ విదేశీయుడు ఆ సంఘటనకు తీవ్రంగా చలించి స్పందించడమూ, ఈ దేశంలోని వ్యవస్థలో ఒంటరి పోరాటానికి సిద్ధపడడమూ చీఫ్ జస్టిస్‌ని అమితంగా ఆకట్టుకున్నాయి. ఆ లేఖను 'పబ్లిక్ ఇంటరెస్ట్ లిటిగేషన్'గా పరిగణించి... ఆ కేసును వెంటనే నమోదు చేసి దోషుల్ని అరెస్టు చేయవలసిందిగా ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేశారాయన. దాంతో నేరస్థుల అరెస్టూ, రిమాండూ చకచకా జరిగిపోయాయి.


ప్రాసిక్యూషన్ కేసు అరంభమయింది. కేసు యొక్క పూర్వపరాలను వివరించాడు పబ్లిక్ ప్రాసిక్యూటర్. తరువాత ప్రధానసాక్షి రిచర్డ్స్ విచారింపబడ్డాడు.

"మిలార్డ్! ఒక ప్రాణి మరో ప్రాణి ప్రాణాలను తీయడం ఘోరం. అది సహింపరాని నేరం. ఆ హక్కు ఎవరికీ లేదు. ఓ నిస్సహాయ ప్రాణి జీవనానికి ఫుల్‌స్టాప్ పెట్టిన ఈ ముద్దాయిలు శిక్షార్హులు. మానవతా దృక్పథంతోనే కాదు, చట్టరీత్యా కూడా అది గొప్ప నేరమే అవుతుంది. అంతేకాదు, ఈ హత్యతో ముద్దాయిలు నాశనం చేసింది ఒక్క జీవితాన్నే అనుకంటే అది ముమ్మాటికీ పొరపాటు! ఎందుకంటే, ఈ హత్య మూలంగా పరోక్షంగా ఎన్నో ప్రాణుల జీవనాలకు ముప్పు వాటిల్లుతుంది. సివిలైజ్డ్ సొసైటీ... భావితరాల మేలు కోరే సమాజం... ఈ చర్యను తీవ్రంగా గర్హిస్తుంది. ఈ దారుణానికి వొడిగట్టిన ముద్దాయిలకు చట్టప్రకారం మరెవ్వరూ మున్ముందు ఇటువంటి ఘోరమైన హత్యలు చేయకుండా తీవ్ర హెచ్చరిక అయ్యేటట్లు తగు శిక్ష విధించవలసిందిగా కోరుతున్నాను. 'ద డిజర్వ్ ద ఎక్స్‌ట్రీమ్ పనిష్మెంట్. బికాజ్ దీసీజ్ ఎ ప్రిమెడిటేటెడ్ మర్డర్... ఇటీజ్ ఎ మర్డర్... మోస్ట్ ఫౌల్!..." ఎమోషన్‌తో ఏకధాటిగా చెప్పుకుపోయాడు రిచర్డ్స్.

అతని కంఠం కంచులా మ్రోగుతుంటే లోపల, బయటా అంతమంది జనం క్రిక్కిరిసి వున్నా అత్యంత నిశ్శబ్దంగా వుంది కోర్టు హాలంతా. ఉచ్ఛ్వాస నిశ్వాసాలను సయితం విస్మరించి ఆ విదేశీయుడి అద్భుతమైన వాదనను ఆసక్తితో, ఆశ్చర్యంతో, అభిమానంతో ఆలకించసాగారంతా.

డిఫెన్స్ లాయరు లేచి గొంతు సవరించుకున్నాడు. తన క్లయింట్స్ నిర్దోషులన్నాడు. రిచర్డ్స్ విదేశీయుడు కనుక ఆ 'దేశవాళీ' ప్రజల చర్యలతో అతనికి సంబంధం లేదన్నాడు. అసలు అది హత్యే కాదనీ, కేవలం పబ్లిసిటీ స్టంటనీ, కోర్టు బలవంతంపైన పోలీసులు ఆ కేసును బుక్ చేయడమయిందే తప్ప, అసలు తన క్లయింట్స్ చర్య నేరం క్రిందే పరిగణించారని వాదించాడు.

ఐ.పి.సి.లో అటువంటి చర్యకు ఏ సెక్షనూ రాయలేదని బల్ల గుద్ది చెప్పాడు. తన క్లయింట్స్ చర్య హత్య పరిధిలోకి వస్తున్నట్లు ఒకవేళ కోర్టు వారు అభిప్రాయపడినట్లయితే... అందువల్ల విక్టిమ్‌కిగాని, ఫిర్యాదికికాని, సమాజానికి గాని,



దేశానికి గానీ ఎవరికీ ఎటువంటి కష్టమూ, నష్టమూ వాటిల్లలేదని స్పష్టం చేశాడు. అది ఫిర్యాదుకి సంబంధించని విషయమన్నాడు. అంతేకాదు... తన క్లయింట్స్‌పైన తప్పుడు అభియోగం చేసి వారికి కష్టమూ, నష్టమూ కలిగించిన ఆ విదేశీయుడి పైన తగు చర్య తీసుకోవాలని కోర్టువారిని ఎదురు కోరాడు.

“మా భౌతికపు ఎల్లల ప్రకారం నేను ఈ దేశానికి చెందకపోవచ్చును. కాని మానవజాతికి ఎల్లలు లేవు. మానవజగతి అంతా ఒకటే. ఆ జాతికి చెందినవాణ్ణే నేను. సాటి ప్రాణి అన్యాయంగా అసువులు బాస్తే, అది భావి తరాలకు కూడా బాధ కలిగించేదిగా అనిపిస్తే ఫిర్యాదు చేసే హక్కు నాకుంది. మరోసారి అలా జరక్కుండా అరికట్టే బాధ్యత నాపై నుంది” అన్నాడు రిచర్డ్స్ డిఫెన్స్ వాదనకు జవాబుగా.

ఇలా వాదప్రతివాదాలు వారంరోజులపాటు తీవ్రంగా కొనసాగాయి. అటువంటి కేసు కోర్టుకి రావడం న్యాయచరిత్రలోనే ప్రథమం. అందుకే దేశమంతటా ఆ కేసుపట్ల కుతూహలమూ, ఆసక్తీ పెంపొందాయి. మీడియా ఎటెన్షనంతా దానిమీదే లగ్నమయింది.

కేసులో ఆర్గ్యుమెంట్స్ ముగిసాయి. న్యాయస్థానం తీర్పు నివ్వాల్సిన తరుణం వచ్చింది. చిత్రమైన ఆ కేసులో కోర్టు ఎలా స్పందిస్తుందో, ఎటువంటి తీర్పునిస్తుందోనని ఆత్రుతగా ఎదురు చూశారంతా.

ఓసారి క్రిక్కిరిసివున్న కోర్టు హాలంతా కలయజూశాడు న్యాయమూర్తి. తీర్పును మరుసటి వారానికి జూన్‌నెల అయిదవ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించాడు.

నిరుత్సాహం చెందారంతా. రిచర్డ్స్ మాత్రం నిబ్బరంగా నవ్వుకున్నాడు. న్యాయమూర్తి తీర్పునివ్వడం కోసం ప్రత్యేకంగా ఆ రోజునే ఎందుకు ఎన్నుకున్నాడో వూహించడం కష్టం కాలేదనతనికి. జూన్ అయిదు ప్రపంచ పర్యావరణ దినం! ఆ కేసులో తీర్పుకి ఆరోజు సముచితమని న్యాయమూర్తి భావించడం సమయోచితంగా అనిపించింది.

ఆ కేసులో ఎవరికి తోచిన భాష్యం వారు చెప్పుకుంటూ... ఎవరి ఆలోచనలను వారు కోర్టు ఇవ్వబోయే తీర్పు గురించి వూహాగానాలు చేసుకుని చర్చించుకుంటూ... తలోరకంగా మాట్లాడుకుంటూ బయటకు నడిచారు జనం.

కోర్టు మీదుగా వెళుతున్న వృద్ధుడు ఆ జనాన్ని చూసి ఆశ్చర్యపోయాడు. ఓ వ్యక్తిని ఆపి “ఏం జరిగిందీ?” అని ఆరా తీశాడు.

“చిత్రమైన మర్డర్ ట్రయల్ ఒకటి జరిగింది. దానిని చూడ్డానికే ఈ జనమంతాను” అని జవాబిచ్చాడు ఆ వ్యక్తి.

“ఓహో! హతుడు ఏ ప్రముఖుడో, పార్టీ నాయకుడో అయివుంటాడు. అందుకే ఇంత సంచలనం” అన్నాడు ఆ వృద్ధుడు సగం స్వగతంగా.

ఆ వ్యక్తి “అదేం కాదు. ఇటువంటి హత్య మనం రోజూ చూసేదే!” అన్నాడు.

“అలాగా! ఇంతకూ హతుడెవరు?” ప్రశ్నించాడు వృద్ధుడు.

“ఓ వృక్షం” నవ్వాడు ఆ వ్యక్తి.

విస్తుపోయి చూశాడు వృద్ధుడు.


“అర్థం కాలేదూ? ట్రావెలర్స్ బంగ్లాలో సుమారు వందేళ్ల వయసున్న ఓ చెట్టును కొట్టేశారట నిందితులు. చెట్టు కూడా ఓ ప్రాణామనీ, దాన్ని నరకడం హత్యతో సమానం అనీ... ఆ చర్య పర్యావరణ కాలుష్యానికి దోహదకారియనీ, భావిపౌరుల ఆరోగ్యానికి హానికరమనీ... ఇలా చెట్లను నరుక్కుంటూ పోతే భావితరాలు పలురకాల రోగాలతో బాధ పడడమే కాక ప్రాణాలను కోల్పోయే ప్రమాదం కూడా వుందనీ, అందుకు కారకులైన వారిని శిక్షించాలనీ వాదిస్తూ ఫిర్యాదు చేశాడు ఓ విదేశీయుడు...” వివరించాడు ఆ వ్యక్తి.

అవాక్కయి వింటున్న ఆ వృద్ధుడు తేరుకుని, “ఇది నిజంగా చరిత్రలోనే కనివిని ఎరుగనిది. అతని వాదనలో బలముంది. భావితరాల పట్ల కన్సర్న్ వుంది” అన్నాడు. “ఇంతకీ కోర్టు ఏమనీ తీర్పు ఇచ్చిందీ?”

“జడ్జిమెంట్ రిజర్వ్‌డ్!” అనేసి వెళ్లిపోయాడు ఆ వ్యక్తి.

‘నిజమే! ఓజోన్ లేయర్ కరిగిపోతోంది. ప్రపంచమంతటా పర్యావరణ కాలుష్యం పెరిగిపోతోంది. మనిషికి ప్రాణవాయువు నానాటికీ కరువయిపోతోంది. చెట్లు ముమ్మరంగా నాటవలసిన ఈ తరుణంలో, వున్నవృక్షలనే నరికి పారేయడం దారుణం, ఘోరాపరాధం! ఇందుకు స్పందించి దాని తీవ్ర పరిమాణాలను చట్టం దృష్టికీ, ప్రజల దృష్టికీ తెచ్చే సాహసం చేసిన ఆ విదేశీయుడికి చేతులెత్తి నమస్కరించాలి!’ అనుకున్నాడు ఆ వృద్ధుడు, చెమర్చిన కన్నులను ఉత్తరీయంతో అద్దుకుంటూ.

■




## తల పొగరు వదులుతున్నది!

సమయం ఎట్లాంటి వారి చేతనైనా కంగు తినిపిస్తుందన్న సంగతి కరీనాకపూర్ విషయంలో రుజువైందనుకుంటున్నారు, బాలీవుడ్ జనం. 'ఖుషీ' చిత్రం సెట్ల మీద హీరోయిన్ కరీనను ఎవరో హీరో ఫర్దీన్‌ఖాన్ గురించి అడిగారట. అప్పుడు కరీన, “ఫర్దీన్ చాలా అదృష్టవంతుడు కనుకే, నా వంటి హీరోయిన్‌తో చేసే అవకాశం లభించింది” అందట. అప్పుడు కరీన కెరీర్ ఆకాశమార్గంలోనూ, ఫర్దీన్‌ది నేలబారునా వుండేవి. ఓ ఏడాది తరువాత... బండి బోల్తా పడిపోయి, ఆకాశం నుంచి కిందికొచ్చి, నేల మీద కాళ్లను ఆన్చవలసివచ్చింది. అప్పుడు తన మాటలూ మార్చుకుంది కరీన. 'ఖుషీ' పూర్తయి విడుదలకు సిద్ధంగా వున్న ఈ తరుణంలో, ఎవరో కరీనను, ఫర్దీన్‌తో నటించటం ఎట్లా వుందని అడిగితే, “ఓ కమాల్ కా ఆర్టిస్ట్ హై (అతను చక్కని నటుడు). అతనితో పని చెయ్యటం నాకు బాగా అనిపించింది. ఫర్దీన్‌కు మంచి భవిష్యత్తుంది” అని సౌమ్యంగా జవాబిచ్చిందట. అంతా కాలమహిమండీ!

ఎస్.